
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024



ఉరుకుంద ఆలయ ఈఓగా పట్టెం గురుప్రసాద్



కౌతాళం, ఆగస్టు 4: మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ ఈఓగా పట్టెం గురుప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నూతన ఈఓకు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారి ఆశీస్సులతో ఉత్సవాలను అందరి సహకారంతో విజయవంతం చేస్తానని ఈఓ తెలిపారు.

కోల్డ్‌వార్..!

డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ మధ్య సమన్వయలోపం


- నలిగిపోతున్న రైతులు
- సీజన్‌లో ఎరువులు ఇవ్వకుంటే ఎలా అంటున్న రైతులు
- క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో ఎరువులిస్తామంటున్న మార్క్‌ఫెడ్ అధికారులు
- బకాయిలు చెల్లించాలని డీసీఎంఎస్ పట్టు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 4:

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులకు సకాలంలో ఎరువులను అందించే విషయంలో డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ సంస్థల మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 17 డీసీఎంఎస్ కేంద్రాలున్నాయి. మార్క్‌ఫెడ్ సంస్థ ఈ కేంద్రాల ద్వారా ఏటా రైతులకు అవసరమైన ఎరువులను అందజేస్తోంది. అదే విధంగా పంట ఉత్పత్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కొనుగోలు చేస్తోంది. అయితే గతంలో ఎన్నడూ లేని సంక్షోభం ప్రస్తుతం ఈ రెండు సంస్థల మధ్య తలెత్తింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో డబ్బులు చెల్లిస్తేనే ఎరువులు ఇస్తామంటూ మార్క్‌ఫెడ్ అధికారులు భీష్మించుకొని కూర్చున్నారు. మరోవైపు డీసీఎంఎస్ అధికారులు తమకు గత నాలుగైదు సంవత్సరాలుగా ఎరువులను విక్రయించినందుకు కమిషన్ రూపంలో రావాల్సిన మొత్తంతో పాటు పంట ఉత్పత్తులను రైతుల నుంచి సేకరించినందుకు రావాల్సిన కమిషన్ మొత్తం దాదాపు రూ.కోటిన్నర దాకా మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి రావాల్సి ఉందని, అయితే.. ఈ మొత్తాన్ని తమకు అందివ్వడంలో మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని డీసీఎంఎస్ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఈ మొత్తాన్ని రాబట్టుకోవాలని, తాము మాత్రం క్యాష్ అండ్ క్యారీ పద్ధతుల్లోనే ఎరువులను సప్లయ్ చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టం చేస్తుండటంతో డీసీఎంఎస్ కేంద్రాల్లోని సిబ్బంది ఎరువులు రైతులకు సప్లయ్ చేయలేక తలపట్టు కూర్చున్నారు. కర్నూలు, డోన్, ఆత్మకూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, బనగానపల్లె, ప్యాపిలి, తదితర 17 చోట్ల డీసీఎంఎస్ కేంద్రాల్లో ఎరువులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మార్క్‌ఫెడ్ కార్యాలయం



కర్నూలులోని డీసీఎంఎస్ కార్యాలయం

రైతుల ఆక్రందనలు

గతంలో డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది ఎరువులను సప్లయ్ చేసేవారు. ప్రైవేటు డీలర్ల వద్ద బస్తా ఎరువుపై రూ.50 నుంచి రూ.100 అధికంగా చెల్లించి రైతులు ఎరువులను కొనుగోలు చేయాల్సి వచ్చేది. డీసీఎంఎస్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారు. అందువల్ల ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు వందల టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను రైతులు కొనుగోలు చేసి పంటల సాగుకు వినియోగించారు. తాజా పరిణామంతో మార్క్‌ఫెడ్ సంస్థ డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను సప్లయ్ చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు డీలర్లు ఎరువులపై రూ.50 నుంచి రూ.100లు అధికంగా వసూలు చేసుకుంటున్నారు.

మా మొర ఆలకించరా...!

మార్క్‌ఫెడ్ అధికారుల తీరుపై రైతుల ధ్వజం

గత నాలుగైదు సంవత్సరాలుగా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, ఎరువుల అమ్మకాలు చేపట్టినందుకు డీసీఎంఎస్ సంస్థకు మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు రూ.కోటిన్నర దాకా చెల్లించాల్సి ఉంది. జీతభత్యాలు, కార్యాలయాల అద్దెలు, కరెంటు చార్జీలు, తదితర మెయింటెనెన్స్ ఖర్చులు భరించాలన్నా మార్క్‌ఫెడ్ సంస్థ కమిషన్ రూపేణా ఇచ్చే డబ్బులే తమకు ఆధారం అని డీసీఎంఎస్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ఎప్పటికప్పుడు కమీషన్‌గా ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకపోవడం వల్ల జీతాలు చెల్లించాల్సిన పరిస్థితి మరో రెండు నెలల్లో తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు సీజన్‌లో ఎరువులు ఇవ్వకుంటే మార్క్‌ఫెడ్ సంస్థతో పాటు ప్రభుత్వంపై కూడా రైతులు నిరసన గళం వినిపించే పరిస్థితులు నెలకొంటున్నాయి. అందువల్ల డీసీఎంఎస్ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇస్తే వారు ఎరువుల సప్లయ్‌కి డబ్బులను వెంటనే చెల్లించే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఎరువులను సప్లయ్ చేస్తాం : నాగరాజు, మార్క్‌ఫెడ్ డీఎం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ఆ సంస్థకు చెల్లించాల్సిన మొత్తాన్ని రాబట్టుకునేందుకు డీసీఎంఎస్ అధికారులు రాష్ట్ర అధికారులను సంప్రదించాలి. ఆ డబ్బులు చెల్లించే అధికారం తమ పరిధిలో లేదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎరువులను ఎటువంటి ఆటంకాలు లేకుండా సప్లయ్ చేస్తాము.

డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను ఇవ్వాలి : భాస్కర్ రెడ్డి, రైతు



సకాలంలో మాకు ఎరువులు అందించకుంటే అధిక ధర చెల్లించి ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులను కొనుగోలు చేయక తప్పదు. ఇప్పటి దాకా ఎరువులను డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎంఆర్‌పీ ధరకే కొనుగోలు చేశాము. మార్క్‌ఫెడ్ సంస్థ ఉన్నతాధికారులు మా పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకుని మాకు ఎరువులను డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇవ్వండి

టీడీపీ సీనియర్ నేత వీరభద్రగౌడ్




అధికారులు, రైతులతో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

హాలహర్వి, ఆగస్టు 4: ఎల్లెల్సీ చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదేనని టీడీపీ సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం ఎల్లెల్సీపై ఆయన పర్యటించారు. తుంగభద్ర నుంచి జిల్లాకు రావాల్సిన నీటి వాటాపై టీబీ బోర్డు డీఈ హనస్ బాషాతో చర్చించారు. కర్ణాటక రైతులు యథేచ్ఛగా జలచౌర్యానికి పాల్పడుతున్నారని, దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూటర్ వద్ద నీటి వాటాలో కోతలు విధించడం వల్ల వరి నాట్లు వేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వీరభద్రగౌడ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా సాగునీరు ఇవ్వాలని, లేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈలు మహేష్, దుర్గప్రసాద్, ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు గిరిమల్లేష్ గౌడ్, మిక్కిలినేని ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులు పెంచే శ్రావణ మాసం..

- నేటి నుంచి ప్రారంభం
- విష్ణు, శైవ ఆలయాలకు యాత్రికుల సందడి



కర్నూలు(కల్చరల్), ఆగస్టు 4: హిందువులకు అత్యంత ఆరాధనీయమైన శ్రావణ మాసం సోమవారం ఆరంభం కానుంది. సందర్భంగా జిల్లాలోని వివిధ పుణ్యక్షేత్రాల్లో, ఆధ్యాత్మిక సంస్థలు, మఠాలలో శ్రావణ మాస ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక ఉమ్మడి జిల్లాలోని ఆయా పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లోనూ యాత్రికుల సందడి పెరగనుంది. శివకేశవులను సమానంగా ఆరాధించడం శ్రావణ మాసం ప్రత్యేకత. అలాగే ఆషాఢం వరకు ఎలాంటి శుభ ముహూర్తాలు లేని తరుణంలో శ్రావణ మాసం కోసం వేచివున్నవారంతా ఈ మాసంలో వచ్చే శుభరోజుల్లో వివాహాలు, నూతన గృహ ప్రవేశాలు, ఆస్తుల కొనుగోళ్లు వంటి శుభకార్యాలను నిర్వహిస్తారు. ఈ నెలలో పౌర్ణమి నాడు చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల శ్రావణమాసం అనే పేరు వచ్చిందని శాస్త్ర పండితులు పేర్కొంటారు. ఈ మాసం ఇతర అన్ని మాసాలకు మించిన భక్తిభావనలను, ఆధ్యాత్మిక చింతనలను ప్రేరేపిస్తుంది. అలాగే మహిళలకు సకల సౌభాగ్యాలను ప్రసాదించే లక్ష్మీదేవి అమ్మవారిని పూజించేందుకు ఈ మాసం ఒక వేదికగా నిలుస్తుంది.

హిందువుల్లో భక్తి భావనలను ప్రేరేపిస్తూ, నిత్య పూజాది కార్యక్రమాలు నిర్వహించేలా శ్రావణ మాసం నిలుస్తుంది. ఈ మాసంలో అనేక పండుగలు విచ్చేస్తాయి. దక్షిణాయణంలో అత్యంత ఫలప్రదమైన నెలల్లో శ్రావణం ఒకటి. శివకేశవుల భేదం లేకుండా పూజించే మాసం ఇదే. ఈ నెలలో వచ్చే సోమవారాలు పరమేశ్వరుడి అత్యంత ప్రీతికరమైనవి. ఇక శ్రావణమాసంలో వచ్చే నాలుగు మంగళవారాల్లో మహిళలు మంగళ గౌరీ వ్రతం ఆచరిస్తారు. శ్రీకృష్ణుడు ద్రౌపదికి, నారదుడు సావిత్రీదేవికి ఉపదేశించిన వరంగా పెద్దలు చెబుతారు. అలాగే మహిళలకు అత్యంత ముఖ్యమైన వ్రతం వరలక్ష్మీ వ్రతం కూడా ఈ మాసంలో పౌర్ణమి ముందురోజు వచ్చే శుక్రవారం ఆచరిస్తారు. శ్రావణంలో శనివారాలు విష్ణుపూజలకు అనుకూలం. తిరుమల శ్రీనివాసుడి జన్మనక్షత్రం కూడా శ్రావణం కావడంతో ఈ నెలలో వచ్చే శనివారాలు విష్ణు స్వరూపుడైన వేంకటేశ్వర స్వామికి ప్రీతిపాత్రమైనవి. ఈ మాసంలో వివిధ రోజుల్లో మహిళలు ఉపవాసాలు, వ్రతాలు ఆచరిస్తారు. ఈ మాసంలో నాగపంచమి, పుత్రద ఏకాదశి, రాఖీ పౌర్ణమి, శని త్రయోదశి, శ్రీకృష్ణ జన్మాష్టమి, హయగ్రీవ జయంతి వంటివి విచ్చేస్తాయి.

శాంతించిన తుంగభద్ర

తగ్గిన వరద ఉధృతి



మంత్రాలయం వద్ద తగ్గుముఖం పట్టిన తుంగభద్ర నది

మంత్రాలయం, ఆగస్టు 4: ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో మంత్రాలయం వద్ద 311 నీటి మట్టంతో 1.23 క్యూసెక్కులకు తగ్గింది. టీబీ డ్యాం నుంచి 1,08,567 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో తుంగభద్ర వరద ఉధృతి క్రమేపి తగ్గుముఖం పడుతోంది. దీంతో నదితీర గ్రామాల్లోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు.. మంత్రాలయం దర్శనార్థం వచ్చిన భక్తులు స్నానాలు ఆచరించే భక్తులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నది ఒడ్డున టవర్లు ఏర్పాటు చేసి పుణ్యస్నానాలు ఆచరించేందుకు మరం అధికారులు ఏర్పాట్లు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి

రియల్ ఎస్టేట్ వివాదాలతోనే హత్య

- రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల అరెస్టు
- రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం హత్య

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 4: రౌడీషీటర్ వెంకటసాయి, అలియాస్ ఖవ్వ హత్య కేసును ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి హత్య కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నంద్యాల పట్టణం గుడిపాడు గడ్డకు చెందిన రౌడీషీటర్ వెంకటసాయి అలియాస్ ఖవ్వ (30) ఈ నెల 2వ తేదీన నంద్యాల మండలంలోని అయ్యలూరి మెట్ట పొలాల్లో ఉన్న వెంచర్‌లో దారుణ హత్యకు గురయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలించి నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు... గతంలో మహానంది మండలం అల్లి నగర్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ రాగినేని సంజీవ కుమార్‌కు మృతుడు వెంకటసాయికి రియల్ ఎస్టేట్, ఆర్థికపరమైన మనస్పర్థలు ఉండటంతో వెంకటసాయిని హత్య చేయాలని సంజీవ పథకం పన్నారు. ఇటీవలే ఓ కేసులో నిందితుడిగా ఉంటూ వెంకటసాయి కడప సబ్‌జైలు నుంచి బెయిల్‌పై విడుదల అయ్యాడు. పథకం ప్రకారం రెక్కీ నిర్వహించిన సంజీవ తదితరులు 2వ తేది అయ్యలూరి గ్రామంలోని ఓ వెంచర్‌లో మద్యం సేవిస్తున్న వెంకటసాయిపై అటాక్ చేసి హత్య చేశారు. హత్యకు పాల్పడిన ఏడుగురిని నంద్యాల పట్టణ శివార్లలోని చాపిరేవుల బ్రిడ్జి వద్ద ఉన్న మూలపెద్దమ్మ గుడి వద్ద ఆదివారం సాయంత్రం నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ పేర్కొన్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు ఒక కారు, ఒక మోటర్ సైకిల్, హత్యకు ఉపయోగించిన 4 వేటకత్తులు, రెండు ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



జుమాలదిన్నె గ్రామంలో ఉరుకుందకు వెళ్లే భక్తుల వాహనాలతో ట్రాఫిక్

కోసిగి, ఆగస్టు 4: కౌతాళం మండలంలోని ఉరుకుంద ఈరన్న ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఉరుకుంద క్షేత్రంలోని ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా రావడంతో కోసిగి మండలంలోని జుమాలదిన్నె ఉరుకుంద రోడ్డులో వాహనాలు రద్దీగా కనిపించాయి. ట్రాఫిక్ భారీగా ఏర్పడటంతో భక్తులు, గ్రామస్థులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

జైన శిల్పాన్ని కాపాడుకోవాలి

-పురావస్తుశాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి



జైన శిల్పాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుల బృందం

కల్లూరు, ఆగస్టు 4: కల్లూరు మండలం నాయకల్లు గ్రామ శివారులో నిర్లక్ష్యంగా పడి ఉన్న వెయ్యేళ్ల నాటి వర్ధమాన మహావీరుని శిల్పాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. మారుమూల ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా పడిఉన్న శిల్పాలు, శిలాశాసనాలు, శిథిలాలపై స్థానికులకు అవగాహన కల్పించే ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ కార్యక్రమంలో భాగంగా ప్లీచ్ ఇండియా బృందం నాయకల్లు గ్రామంలో నిర్లక్ష్యంగా పడి ఉన్న శిల్పాలను ఆదివారం పరిశీలించింది. ఊరిబయట పొదల్లో 24వ జైన తీర్థంకుడైన వర్ధమాన మహావీరుడి శిల్పం, ఒక స్థంభం, పీఠాలను గ్రామానికి తరలించి భద్రపరిచి, చారిత్రక వివరాలతో ఒక పేరు పలకను ఏర్పాటు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తుశాఖ అధికారి మహేంద్రనాయుడు, ప్లీచ్ ఇండియాకు చెందిన జితేంద్ర, చరణ్, శ్రీహరి, హరీష్, ఉదయ్‌కిరణ్, ధుర్గ, మైత్రేయ, కౌస్తూబ్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త దారుణ హత్య

- సార్వత్రిక ఎన్నికల్లో సహకరించలేదన్న అక్కసుతోనే దారుణం?
- ఇంట్లో నుంచి లాక్కొచ్చి బండరాళ్లతో మోది చంపేసిన వైనం
- ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన హంతకులు



సుబ్బరాయుడు (ఫైల్)

మహానంది, ఆగస్టు 4: సార్వత్రిక ఎన్నికల్లో సహకరించలేదన్న అక్కసుతో ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తిని కొంతమంది దారుణంగా హత్య చేశారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మృతుడి భార్య బాల సుబ్బమ్మ కూడా తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన మహానంది మండలం సీతారామపురంలో జరిగింది. ఈ గ్రామానికి చెందిన సుబ్బారాయుడు అలియాస్ పెద్దన్న (68) వైసీపీ కార్యకర్తగా రాజకీయాల్లో క్రియాశీలకంగా కొనసాగుతున్నాడు. అతడిని ఇటీవల వైసీపీ నుంచి టీడీపీ చేరిన కొందరు దారుణంగా హత మార్చారు. ఇందుకు సంబంధించిన మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీతారామాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడి, భరత్‌రెడ్డి, పుల్లారెడ్డి, లక్ష్మిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కాల్లూరి శ్రీనివాసులతోపాటు మరో 38 మంది సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్రలు, రాడ్లతో తన భర్తపై దాడికి తెగబడ్డారని బాలసుబ్బమ్మ పేర్కొంది. ఇంట్లో నుంచి బయటకు లాక్కుని వచ్చి బండరాళ్ళతో అతికిరాతకంగా చంపేశారని చెప్పింది. గతంలో తాము, తమపై దాడి చేసిన శ్రీనివాసరెడ్డి అంతా వైసీపీలో ఉండేవారమని, అయితే ఎన్నికలకు ముందు శ్రీనివాసరెడ్డి టీడీపీలో చేరారని, ఎన్నికల్లో వారికి సహకరించలేదన్న కసితోనే తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసి సుబ్బరాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా గాయాలపాలైన బాల సుబ్బమ్మను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సీతారామపురం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఆదివారం పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, అడిషినల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌లు ఆదివారం తెల్లవారుజాముననే సీతారామపురం చేరుకుని హత్యకు గల కారణాలను సేకరించారు.

నివాళులర్పించిన వైసీపీ నేతలు : ఆదివారం సాయంత్రం ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పాచక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, శిల్పా రవిచంద్రారెడ్డిలు సీతారామపురం గ్రామానికి చేరుకుని వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినందువల్లే టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి, అనుచరులు హత్యకు పాల్పడ్డారన్నారు. వ్యక్తిగత కక్షతో గ్రామంలో తన ఉనికిని కాపాడుకునేందుకు ఇలాంటి దారుణాలకు ఒడిగడతారా? అని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘనంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డి



గౌరు దంపతులకు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

కల్లూరు, ఆగస్టు 4: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత జన్మదిన వేడుకలను టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తన స్వగృహంలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల నుండి ముఖ్య నాయకులు, అధికారులు కార్యకర్తలు ఎమ్మెల్యే గౌరుచరితకు పూలబొకేలు, పూలమొక్కలు, పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గౌరుచరిత కేక్‌కట్ చేయగా టీడీపీ నాయకులు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కల్లూరులోని చౌడేశ్వరిదేవి అమ్మవారిని గౌరుచరిత, ఆమె తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నాయకులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.



చౌడేశ్వరిదేవి ఆలయంలో గౌరుచరిత పూజలు

చికిత్స పొందుతూ రైతు మృతి



నాగేంద్ర (ఫైల్)

ఆళ్లగడ్డ/దొర్నిపాడు, ఆగస్టు 4: అప్పులు అధికమై ఆత్మహత్యకు యత్నించిన రైతు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా... దొర్నిపాడు మండలం భాగ్యనగరం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు నాగేంద్ర (38) మూడేళ్ల నుంచి సీడు పత్తి పంట 5 ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. అయితే ప్రకృతి ప్రభావం వల్ల ఆశించిన మేర దిగుబడులు రాలేదు. ఈ పంటల సాగుకోసం వివిధ చోట్ల రూ.14 లక్షలు అప్పు చేశాడు. పంటలు చేతికి రాకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిళ్ల అధికం కావడంతో అప్పు తీర్చలేక శనివారం నాగేంద్ర సొంతపొలంలోనే విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈవిషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగేంద్రకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. మృతుడి తండ్రి సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐ నగీనా తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

సి.బెళగల్, ఆగస్టు 4: మండలంలోని కొత్తకోట దగ్గర ఉన్న ఎకరన్నర పొలానికి నీళ్ల కట్టుకోడానికి కురువ ఖాజ (40) అనే రైతు బావిలోకి దిగి ఫుట్ బాల్ వాచర్ బిగిస్తుండగా కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. రైతు గ్రామం సుంకేసుల. ఈ ఘటన ఆదివారం జరిగింది. రైతు బావిలోకి దిగి ఫుట్‌బాల్ వాచర్ బిగిస్తుండగా ఈ ప్రమాదం జరగడం గమనించిన రైతులు కరెంట్ సరఫరా నిలిపేశారు. అప్పటికే రైతు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సి బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో కలిసి బావిలో పడి ఉన్న మృత దేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరుకు తరలించినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఖాజాకు భార్య పద్మావతమ్మ, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి...

సి.బెళగల్, ఆగస్టు 4: మండలంలోని పలుకుదొడ్డి గ్రామానికి చెందిన ఉరుకుందమ్మ, శేఖర్ దంపతుల కుమారుడు మనోజ్(16) ఆత్మహత్యాయత్నం చేసి కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. పదో తరగతి ఫెయిల్ అయిన మనోజ్ తండ్రి మందలించాడని వారం రోజుల కింద విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భర్త చేతిలో గాయపడిన మహిళ మృతి

కోడుమూరు (రూరల్), ఆగస్టు 4: మండలంలోని పులకుర్తి గ్రామంలో గత బుధవారం అర్ధరాత్రి భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవి దంపతుల కూతురు మల్లీశ్వరి భర్త తాగుడుతో విసిగిపోయి బస్తిపాడు నుంచి పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చింది. రంగడు గత నెల 31 అర్ధరాత్రి మద్యం తాగి వచ్చి గొడవ పడ్డాడు. రోకలితో భార్య మల్లేశ్వరి, అత్త లక్ష్మీదేవి తలపై కొట్టాడు. అడ్డుగా వచ్చిన మామ సుంకన్నపై కూడా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మల్లేశ్వరి ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

లక్ష్మీనగర్ తండాలో కార్డన్ సెర్చ్

కోడుమూరు (రూరల్), ఆగస్టు 4: వెల్దుర్తి మండలంలోని లక్ష్మీనగర్ తండాలో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు సెబ్, స్క్వాడ్, వెల్దుర్తి పోలీసులతో కలిసి మూకుమ్మడిగా తనిఖీ చేశామని అన్నారు. దాడిలో 35 లీటర్ల నాటుసారా గుర్తించి సీజ్ చేశామని తెలిపారు. అలాగే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.







యువకుడిపై మద్యం బాబుల దాడి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 4: నంద్యాల మండలం వెంకటేశ్వరపురం గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. దారిన పోయే వ్యక్తిని బెదిరించి మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవ పెట్టుకున్నారు. దీనికి కొనసాగింపుగా అతని సోదరుడి బట్టలూడదీసి దాడి చేశారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన కార్తీక్ వెంకటేశ్వరపురంలోని ఎస్డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. గత గురువారం కళాశాల చైర్మన్ పుట్టిన రోజు వేడుకలకు హాజరై తన స్నేహితుడు మధుతో కలసి ఇంటికి వెళుతుండగా కళాశాల సమీపంలోని వెంచర్‌లో మద్యం తాగుతున్న కొంత మంది వీరిద్దరిని అటకాయించి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. ఈ విషయాన్ని కార్తీక్ తన అన్న సాయి లోకేశ్వర రెడ్డికి చెప్పడంతో ఆయన తన స్నేహితులను పిలుచుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం బాబులు ఆగ్రహంతో సాయి లోకేశ్వరరెడ్డి బట్టలు ఊడదీసి అమానుషంగా దాడి చేశారు. వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన శంకర్ సాయి.. లోకేశ్వర్‌రెడ్డి చెవిని కొరికాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి లోకేశ్వర్‌రెడ్డి వెళ్ళాడు. ఈ దాడుల దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటనపై బాధితులు నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దస్తగిరి బాబు తెలిపారు.

టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

బేతంచెర్ల, ఆగస్టు 4: మండలంలోని సంకలాపురం గ్రామంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ కార్యకర్త మల్లికార్జున గ్రామంలోని దేవాలయానికి భజనకు వెళ్తుండగా.. వైసీపీ కార్యకర్తలు ఆయనపై ఘర్షణ పడి దాడి చేసి గాయపరిచారు. వైసీపీ కార్యకర్తలు రొక్కం నాగేశ్వరరెడ్డి, బండి కొండారెడ్డి, తెలుగు కృష్ణుడు, తెలుగు రమేష్, మహేష్, తెలుగు దనుష్, శివశంకర్‌రెడ్డిలు మల్లికార్జునను దారికి అడ్డం కాచి నానా దుర్భాషలాడి కొట్టి గాయపరిచారు. దీంతో కుటుంబ సభ్యులు మల్లికార్జునను చికిత్స నిమ్మిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బేతంచెర్ల పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బాధితుడు మల్లికార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

సి. బెళగల్, ఆగస్టు 4: మండలంలోని పోలకల్లు, గుండ్రేవుల, కొత్తకోట, క్రిష్ణదొడ్డి కొండపైన వెలసిన శ్రీకోన వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు ఆయా గ్రామాలలో వెలసిన అమ్మవారి ఆలయాల్లో అమావాస్య పూజలు జరిగాయి. అలాగే శ్రావణ మాస పూజలు కూడా జరిగాయి. భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల ఆయా గ్రామాలలోని దేవాలయాలలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయా గ్రామాల అలయ కమిటీ పెద్దలు తెలిపారు.











ఘనంగా గౌరు చరిత జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న గౌరు చరిత





రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, గౌరు దంపతులను గజమాలతో సన్మానిస్తున్న పందిపాడు నాయకులు

కల్లూరు, ఆగస్టు 4: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, ప్రజలకు సంక్షేమ పాలన అందించాలని టీడీపీ నాయకులు ఉలిందకొండ ఈవీ రమణ, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు కురపాటి దేవేంద్రారెడ్డి ఆకాంక్షించారు. గౌరుచరిత జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈవీ రమణ ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఉలిందకొండ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పదవ తరగతి స్టడీ మెటీరియల్‌తో పాటు పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. వెంకటేశ్వరరెడ్డి, వాకిటి మాదేష్, కురువ ధనుంజయ, కె.మహేష్‌గౌడ్, విశ్వం, రాజ్, ఈవీఆర్.యూత్ నాయకులు శ్రీకాంత్, షేక్షావలి, విక్రమ్, నారాయణ, వెంకటరమణ ఉన్నారు.

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత గౌరు వెంకటరెడ్డి దంపతులను పందిపాడు టీడీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. ఆదివారం కర్నూలు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కురపాటి దేవేంద్రారెడ్డి, శేఖర్ చౌదరి సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేయగా భారీ గజమాలతో గౌరు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పూల శివశంకర్, లక్ష్మణ్‌యాదవ్, భీష్ముడు, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

● ఓర్వకల్లు మండలం బొడ్డువానిపల్లె ఆంజనేయ స్వామి ఆలయానికి పూర్వ వైభవం వచ్చిందని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం పుసులూరు ప్రభాకరరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరు చరిత స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయ సమీపంలో మొక్కలు నాటారు. అదేవిధంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గౌరుచరితను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, పుల్లారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● గౌరు చరిత జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 21వ వార్డు టీడీపీ నాయకులు చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని పాణ్యం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆదివారం అర్బన్ వార్డుల అధ్యక్షుడు పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి ఆధ్వర్యంలో 21వ వార్డు కిసాన్‌నగర్ పార్క్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పెద్దఎత్తున యువకులు పాల్గొన్నారు. గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జనసేన ఇన్‌చార్జ్ చింతాసురేష్, రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి, డి.రామాంజనేయులు, చిన్నమారెన్న, పెద్దటేకూపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భైరాపురం ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు, ఆగస్టు 4: మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ భైరాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయ స్వామికి ఆదివారం అమావాస్య పర్వదినం కావడంతో ఆలయాలకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొమ్ము చెరువు ఆంజనేయస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, మంగళహారతుల వంటి పూజలు చేశారు. మండలంలోని భైరాపురం గ్రామ సమీపాన వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కాల్వ గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామికి కాపు సంఘం నాయకులు కేవీ మధు, భక్తుల ఆధ్వర్యంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి జన్మ దినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు పుసులూరు ప్రభాకర్ రెడ్డి, విశ్వేశ్వర రెడ్డి, సుధాకర్ రెడ్డి, పార్వతమ్మ, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

కర్నూలు(అర్బన్), ఆగస్టు 4: పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి జన్మదిన వేడుకలు టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఆదివారం నగరంలోని ఆమె నివాసంలో పూల బొకేలు ఇచ్చి జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి పోగు బజారన్న, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, టీడీపీ ఎస్సీసెల్ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు ధరూర్ జేమ్స్, నంద్యాల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి బొగ్గుల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి జలీల్‌బాషా, టీసీ సెట్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ పాణ్యం అధ్యక్షులు వినోద్ కుమార్, ఐటీడీపీ కర్నూలు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత జన్మదిన సందర్భంగా ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన జన్మదిన వేడుకల్లో టీడీపీ నగర బ్రాహ్మణ సాధికార కమిటీ నాయకులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులకు వేద ఆశీర్వాదం అందజేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, మంత్రాలయ రాఘవేంద్ర స్వామి వారి పరిమళ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీ రవిచంద్ర శర్మ, సండేల్ చంద్రశేఖర్, కంచుగంట ల శ్యామ సుందరరావు, కరణం హరిశర్మ, శ్రీనివాస రాజు, కరణం అనూజ్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.

● ఉచిత శిక్షణ ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన గౌరు చరిత జన్మదిన వేడుకల్లో లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చిన్నస్వామి, సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు డి. నాగరాజు, సభ్యులు క్రిష్టఫర్, దుగ్గపూటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వయం ఉపాధి శిక్షణ ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి ఆవిష్కరించారు.

ఆలయాల్లో ఆషాఢ, అమావాస్య పూజలు



కర్నూలులోని సప్తగిరి నగర్ ఆలయంలో పూజలు

కర్నూలు (కల్చరల్), ఆగస్టు 4: ఆషాడ మాసం చివరి ఆదివారం అమావాస్య యుక్తంగా కలిసి రావడంతో ఆదివారం వివిధ ఆలయాల్లో ఆషాఢ అమావాస్య పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాలు, చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక సప్తగిరి నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వందలాదిగా మహిళా భక్తులు బోనాలతో ఆలయానికి చేరుకొని ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక కల్లూరులోని చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా మహాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పాతనగరంలోని రామాంజనేయ దేవాలయం, రాంభొట్ల దేవాలయం, అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, బళ్లారి చౌరస్తాలోని భక్తాంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామివారికి అమావాస్య పూజలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చౌడేశ్వరికి సారె

ఓర్వకల్లు, ఆగస్టు 4: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా జరి గాయి. అమ్మవారికి మహిళలు, చీర సారె సమర్పించారు. అనంతరం అమ్మవా రికి అభిషేకాలు, కుంకుమార్చన వంటి పూజ లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈనాటి ఈ బంధం ఏనాటిదో..

ఓర్వకల్లు, ఆగస్టు 4: ఓర్వకల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-93 బ్యాచ్‌కు చెందిన ఆదివారం కలుసుకున్నారు. గురువులు అశ్వత్థ నారాయణ శర్మ, సుదర్శన్, శంకరయ్య, శ్రీకాంత్‌లను పూర్వ విద్యార్థులు సన్మానించారు. పూర్వ వద్యార్థుల సమ్మేళనానికి ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరెడ్డి హాజరు కాగా పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు సహాయ కార్యక్రమాలు అందిస్తామని, షాషా, గోపికృష్ణ, అల్లస్వామి తదితర పూర్వ విద్యార్థులు తెలిపారు.

స్నేహం గొప్పది

గూడూరు, ఆగస్టు 4: అన్ని బంధాల కంటే స్నేహ బంధం ఎంతో గొప్పదని మాజీ జడ్పీటీసీ, చైతన్య సేవా సంస్థ అధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గూడూరులో ఎల్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కృష్ణమనోహర్, రమేష్, శ్రీనివాసులు, రామయ్య, నాగరాజు, విశ్వనాధ ఆచారి, లక్ష్మీకాంతం, నరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుంటేనే రక్షణ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 4: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే ప్రజలకు రక్షణ అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్, మానవతా కన్వీనర్ మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదురుగా ప్రకృతి ప్రేమికులు హాజరు కండి.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ వయానాడ్ మృతులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ప్రతినిధులు హాజరై క్యాండిల్ లైట్ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్, జనవిజ్ఞాన వేదిక, మానవతా, ఆరోపా, ఆర్ఎస్‌డీఎస్ సంస్థల ప్రతినిధులు యుగంధర్‌రెడ్డి, శేషయ్య రమణ, ప్రతాప్, జయంత్, తిరుపతిసాయి, విజయ్ పాల్గొన్నారు.

'కవిత్వం దృశ్య కావ్యంలా సాగిపోవాలి'

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 4: కవిత్వం కళ్లముందు కనిపించే ఒక దృశ్య కావ్యంలా సాగిపోవాలని, అలాంటి అరుదైన కావ్య పుస్తకంలా 'వెన్నెల కురవని రాత్రి' పుస్తకం నిలిచిపోతుందని ప్రముఖ కవి రాధేయ అన్నారు. ఆదివారం నగరంలో మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సాహితీ వేదికపై కర్నూలుకు చెందిన కవయిత్రి స్వయంప్రభ రాసిన 'వెన్నెల కురవని రాత్రి' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. కార్యక్రమంలో ఎంపీ బసవరాజు, ఆవుల చక్రపాణి యాదవ్, విరసం నాయకుడు పాణి, కవయిత్రి స్వయంప్రభ పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కింది

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 4: మూడు దశాబ్దాలు పోరాటానికి ఫలితం దక్కిందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. ఆదివారం స్థానిక 48వ వార్డు రోజా వీధిలో డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మీసాల సుమలత మాట్లాడుతూ రాష్ట్రంలో కులాల వర్గీకరణ తర్వాత ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. వెనుకబాటుతనం పేరుతో వంద శాతం రిజర్వేషన్లను ఒకే ఉప వర్గానికి ధారాదత్తం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని కోరారు.

వీహెచ్‌పీ విశేష సంపర్క్ రాష్ట్ర ప్రముఖ్‌గా ప్రతాపరెడ్డి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 4: బజరంగ్ దళ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తూముకుంట ప్రతాపరెడ్డిని వీహెచ్‌పీ (విశ్వహిందూ పరిషత్) విశేష సంపర్క్ రాష్ట్ర ప్రముఖ్‌గా నియమించినట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నందిరెడ్డి సాయిరెడ్డి, కాకర్ల రాముడు తెలిపారు. ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో జరిగిన మూడు రోజుల వీహెచ్‌పీ రాష్ట్ర సమావేశాలు ఘనంగా ముగిశాయి. నూతన కమిటీ నేతల నియామకంలో భాగంగా ప్రతాపరెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

రక్తదాన శిబిరం

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 4: నందమూరి మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నగర పాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న కర్నూలు బ్లడ్ బ్యాంకులో తలసేమియా చిన్నారులకు రక్తదానం చేశారు. సెప్టెంబరు 6న మోక్షజ్ఞ జన్మదినం పురస్కరించుకొని శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కార్యదర్శి రమేష్ రెడ్డి, మోతిలాల్, సభ్యులు ప్రతాప్, జావీద్‌బేగ్, వెంకటేష్, నాగసూరి, అరుణ్, తిరుమలేష్, బ్లడ్ బ్యాంక్ సెంటర్ డైరెక్టర్ డా.శ్రీహరి, పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కోడుమూరు, ఆగస్టు 4: రాష్ట్రంలో నెలకొన్న విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కొండపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహనీయుడు షిరిడీ సాయిబాబా

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 4: పుడమిపై నడయాడిన మహనీయుల్లో షిరిడీ సాయిబాబా ఒకరని, ఆయన జీవిత చరిత్రను తెలియజేసేలా సాయి భక్తులు ప్రదర్శించిన నృత్య రూపకం అపూర్వ ఘట్టమని కృష్ణాజిల్లా కూచిపూడి సిద్ధేంద్ర యోగి నృత్య కళాశాల అధ్యక్షుడు వేదాంతం రామలింగేశ్వర శాస్త్రి అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలు సాయి భక్తమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'శ్రీ షిరిడీ సాయిబాబా' జీవిత చరిత్ర నృత్య రూపకం అసాంతం ఆకట్టుకుంటుంది. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, రూపక ప్రదర్శన అనంతరం కార్యక్రమ నిర్వాహకులు ఎస్‌జీ మహాబలేశ్వర్, చింతా శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జడ్పీ యూనిట్ ఎన్నికలు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 4: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం కర్నూలు మండల పరిధిలోని పసుపుల గ్రామ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డి ఎన్నికల అధికారిగా, కోడుమూరు మండల కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు సహాయ ఎన్నికల అధికారిగా ఎన్నికలు నిర్వహించారు. జిల్లా పరిషత్ యూనిట్ అధ్యక్షునిగా రామచంద్ర మూర్తి, కార్యదర్శిగా మహ్మద్ హక్, అసోసియేట్ అధ్యక్షుడుగా జీవీ కృష్ణారెడ్డి, కోశాధికారిగా తిరుమలేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడుగా మధుసూదనయ్య, జాయింట్ సెక్రటరీగా జి.మాధవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేంద్ర యాదవ్ గెలుపొందారు. ఈ ఎన్నికలు ఉత్కంఠ మధ్యన సాగాయి. ఈ మేరకు ఎన్నికల అధికారి హేమంత్ కుమార్‌రెడ్డి గెలుపొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

పుల్లా రామాంజనేయులుకు ఉగాది పురస్కారం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 4: కర్నూలుకు చెందిన బాలల కథా రచయిత, ఉపాధ్యాయుడు పుల్లా రామాంజనేయులు రాసిన 'తోకలేని పిట్ట' నవలకు ఉత్తమ పురస్కారం లభించింది. హైదరాబాదుకు చెందిన 'చదువు - అన్వీక్షికి' సంస్థ 2023లో ఉగాది సందర్భంగా నిర్వహించిన నవలల పోటీల్లో ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాదులోని ప్రసాద్ సినిమా రివ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ప్రముఖ సినీ దర్శకుడు వంశీ, సినీ నటుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా ఉగాది పురస్కార జ్ఞాపిక, రూ.5వేలు నగదు బహుమతి అందుకున్నారు.

సీఎంను విమర్శిస్తే సహించం : టీడీపీ

ఓర్వకల్లు, ఆగస్టు 4: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శిస్తే క్షమించే ప్రసక్తే లేదని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హత్యా రాజకీయాల చేస్తున్నాడని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడటం సరికాదన్నారు. హత్యా రాజకీయాలు, అక్రమ కేసుల ఘనత జగన్‌దే అన్నారు. ఓర్వకల్లు మండలాన్ని ఎన్డీయే ప్రభుత్వం కారిడార్‌గా ఏర్పాటు చేసిందని, పరిశ్రమలు వస్తున్నాయన్నారు.

నూతన ఆవాజ్ కమిటీ ఎన్నిక

కోడుమూరు, ఆగస్టు 4: కోడుమూరు పట్టణ ఆవాజ్ కమిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక షాదిఖానాలో ఆదివారం ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ సుభాన్, జిల్లా అధ్యక్షులు ముస్తఫా అధ్యక్షతన కమిటీను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా ఖాజీ ఇషాక్, కార్యదర్శిగా హుస్సేన్ పీరా, ఉపాధ్యక్షులుగా హుస్సేనప్ప, సునార్ షాషావలి, ఉప కార్యదర్శులుగా షఫీ, ఖురేషి మిన్నల్లా, మాలిక్, కోశాధికారిగా హుస్సేన్, కలేగర్ రఫీక్ సభ్యులుగా దావూద్, ఖాజా, రఫీ, బాషా, అజీజ్, ఫారూఖ్, హీరావలి, ఖురేషి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఘనంగా షడ్రక్ వర్ధంతి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 4: సీపీఎం నాయకుడు టి.షడ్రక్ నాలుగో వర్ధంతిని నగరంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సుందరయ్య భవన్, స్థానిక గడియారం ఆసుపత్రి ఎదురుగా సుర్జీత్ భవన్, షరీన్ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, ముజఫర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, అన్నపూర్ణమ్మ, టి.వినోద్, సుధాకరప్ప, టి.రాముడు, రాజశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● దివంగత షడ్రక్ వర్ధంతిని పురస్కరించుకుని పాతబస్తీ ప్రాంతంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. పాతబస్తీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యక్రమంలో డా.వినోద్, డా.భరత్, డా.స్వాతి, శేఖర్, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: స్థానిక సీపీఎం కార్యాయలంలో షడ్రక్ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సీపీఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్, సీపీఎం, సీఐటీయూ, చేనేత కార్మిక నాయకులు నాయకులు రాజు, లక్ష్మన్న, వీరన్న, వెంకటేశ్, నాగరాజు, రాముడు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 4: వర్షాకాలంలో ప్రజలు విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని లైఫ్ హోమియోపతికి చెందిన డా.పర్ల శిరీషారెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరులో శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి సందర్భంగా లైఫ్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాతావరణంలో మార్పులు, వర్షాల నేపథ్యంతో వస్తున్న వైరస్, బ్యాక్టీరియా విష జ్వరాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.హరిప్రసాద్, కార్యనిర్వహకులు ఈశ్వర్ పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న లైఫ్ హోమియోపతి వైద్యులు

'తుంగభద్ర దిగువ కాలువకు నీటి వాటా ఇవ్వాలి'


నీటి వాటాపై సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సాయిబాబా

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 4: హాస్పెట్ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువకు రావాల్సిన వాటా నీరు అందించి రైతులు వలసలను నివారించాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా కోరారు. విజయవాడలో శనివారం సీఎం చంద్రబాబునాయుడు కలిసి ప్రత్యేకంగా విన్నవించినట్లు తెలిపారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలు అధికంగా వర్షాధార భూములే అని తెలిపారు. నీటి పారుదల సౌకర్యం తక్కువగా ఉందని, పంటలు లేక పంటలు పండక రైతులు మహానగరాలకు వలసలు వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర డ్యాం నుండి ఆంధ్రప్రదేశ్ వాటాగా 734 క్యూసెక్కుల నీరు రావాల్సివుండగా ఎల్లెల్సీలో కేవలం 250 క్యూసెక్కులు నీరు మాత్రమే వస్తున్నాయన్నారు. సుమారు 20 టీఎంసీ నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కౌతాళం మండలం మ్యాళిగనూరు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తుంగభద్ర నదిపై నిర్మిస్తే సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీటి వసతి ఏర్పడుతుందన్నారు.

'ఆలూరు అభివృద్ధికి సహకరించాలి'


ఎమ్మెల్యే రామాంజినేయులును సన్మానిస్తున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, ఆగస్టు 4: వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ఆలూరువాసి గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులును టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళ నాయకురాలు జ్యోతి కలసి కోరారు. ఆదివారం ఆలూరులో ఆయనను ఘనంగా సన్మానించారు. జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు తాగు నీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

సమస్యలు విన్నవించిన ఉద్యోగులు, ప్రజలు

మోడల్ బాలికల హాస్టల్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వార్డెన్‌లను కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేయాలని, 24/7 విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని జిల్లా అధ్యక్షురాలు సుధారాణి పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులును కలసి కోరారు. ప్రిన్సిపల్ సెక్రటరీ కొన శశిధర్‌తో చర్చిస్తామన్నారు. అలాగే గిరిజన బాలికల హాస్టల్‌లో దినసరి పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను అప్కాస్ విధానంలోకి మార్పు చేయాలని కార్మికులు విన్నవించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం పలువురు ఘనంగా జరుపుకున్నారు. ఉజ్వల మిత్రమండలి సభ్యులు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రాంజల చెరువు వద్ద కలుసుకొని ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉజ్వల మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్ కుమార్, సత్య, సమన్వయకర్తలు ప్రహ్లాద, స్వామినాథ్, వేంకటేష్, కేశవ పాల్గొన్నారు.

ఉచితంగా మందుల పంపిణీ

ఆదోని టౌన్, ఆగస్టు 4: ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) వారి ఆధ్వర్యంలో ఆదివారం ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో చిన్నారులకు రోగనిరోధక శక్తిని పెంచే మందులను ఉచితంగా అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, వికాస తరంగిణి సహకారంతో కాకుబాల్ నాగేష్ సౌజన్యంతో త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి పర్యవేక్షణలో తయారైన ఈ ఆయుర్వేద మందులు చిన్నారులకు రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు మానసిక ఎదుగుదల, మేధాశక్తి, ఆయుష్షు పెంపునకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు డైమండ్ రఘు, వెంకటేశ్వర్లు, డా. రంజిత్, ప్రసాదరావు మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమత శ్రీ, గీత సభ్యులు శ్రీదేవి, అనూష పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం'

తుగ్గలి, ఆగస్టు 4: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన సుప్రీం కోర్టుకు అనంతరం సీఎం చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటామని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కొత్తూరు నాగరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పగిడిరాయి కొత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ ఏబీసీడీ వర్గీకరణకై పోరాడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

శ్రీమఠంలో అష్టోత్తర పారాయణం ప్రారంభం

● తుంగా నదిలో పుష్కర యోగా


తుంగభద్ర నదిలో పుణ్య స్నానం చేస్తున్న పీఠాధిపతి, శిష్యులు

మంత్రాలయం, ఆగస్టు 4: వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో సామూహిక అష్టోత్తర పారాయణం ప్రారంభించారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని తుంగభద్ర నదిలో పండితులు, శిష్యులతో కలిసి పుష్కర యోగాలో భాగంగా పుణ్యస్నానాలు ఆచరించి భక్తులకు నీళ్ల చల్లి ఆశీర్వదించారు. అనంతరం ఊంజల మండపంలో రజిత ఊయలలో రాఘవేంద్రస్వామి విగ్రహాన్ని ఉంచి హారతులు ఇచ్చారు. చాతుర్మాసదీక్షల్లో భాగంగా సామూహిక అష్టోత్తర పారాయణం శ్రీరాఘవేంద్రస్వామి స్తోత్ర అష్టోత్తర పారాయణం, దండోదక స్నానం ఆచరించారు. అనంతరం భక్తులనుద్దేశించి పీఠాధిపతి మాట్లాడారు. వివిద రాష్ట్రాల నుంచి వచ్చిన పండితులు సాంప్రదాయ శాస్త్రోక్తంగా పీఠాధిపతులకు పట్టువస్త్రాలు సమర్పించి గురుభక్తిని చాటుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ పాల్గొన్నారు.

ప్రహరీ పరిశీలన


ప్రహరీని పరిశీలిస్తున్న పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, టీడీపీ నేత వీరభద్ర గౌడ్

ఆలూరు, ఆగస్టు 4: ఆలూరు పట్టణంలోని ఉరుకుంద ఈరన్న కొట్టాల కాలనీకి మధ్యలో పోలీసులు నిర్మించిన ప్రహరీని ఆదివారం సాయంత్రం గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఆలూరు సీనియర్ నేత వీరభద్ర గౌడ్ పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా ఉరుకుంద ఈరన్న కాలనీకి బండి రస్తా ఉండేదని పోలీసు అధికారులు కాలనీకు మధ్యలో గోడ నిర్మించడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు తెలిపారు. ప్రహరీ వల్ల అత్యవసర సమయాల్లో కనీసం అంబులెన్స్, ఆటో, ద్విచక్ర వాహనం వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని వివరించారు. పోలీసు ఉన్నత అధికార్లతో చర్చిస్తామని.. అవసరమైతే సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి రహదారి పునరుద్ధరిస్తామని వారు హామీ ఇచ్చారు.

'చర్యలు తీసుకోవడంలో అధికారుల జాప్యం'

ఎమ్మిగనూరు, ఆగస్టు 4: కస్తుర్బా విద్యాలయం ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకుండా జిల్లా విద్యాధికారులు జాప్యం చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం నాయకులు శేఖర్, ఉదయ్, రాజేష్, వీరేష్, సోమశేఖర్, సురేష్ మాట్లాడుతూ కస్తుర్బా విద్యాలయంలో ప్రిన్సిపాల్ విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించటంలో విఫలమయ్యారని అన్నారు. అంతేగాక భోజనం, టిఫిన్ సమయం పాటించడం లేదని జిల్లా అధికారుల పరిశీలనలో బయట పడినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కాజా, వెంకటేష్, రాజేష్, మంజు, గణేష్, రామాంజి పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రార్థనలు

ఎమ్మిగనూరు, ఆగస్టు 4: మండల పరిధిలోని కొటేకల్ గ్రామంలో వర్షం కోసం ముస్లింలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ సమీపంలోని పొలాల్లో మత గురువు ఆధ్వర్యంలో గ్రామంలోని ముస్లింలు, రైతులు ప్రార్థనలు చేశారు.

కౌతాళం: మండలంలో వర్షం కోసం గ్రామాలలోని దేవాలయాల్లో జలాభిషేకాలు చేశారు. ఆదివారం అమవాస్య కావడంతో ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం, బుదుములదొడ్డి అంజనేస్వామి దేవాలయం కౌతాళంలోని జగద్గురు ఖాదర్ లింగస్వామి దర్గాలో భక్తులు వర్షం కోసం ప్రత్యేక పూజలు చేపట్టారు. కౌతాళంలో చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు.

అమావాస్య పూజలు

పెద్దకడబూరు ఆగస్టు 4: మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలోని పైరయ్య ఆంజనేయ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం నుంచే పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు రామకృష్ణ స్వామి తెలిపారు. ఈ అమావాస్యకు అన్నదాన దాత గద్వాలకు చెందిన రాజశేఖర్ నాయుడు, కావేరి దంపతులు నిర్వహించారని ఆలయ అర్చకులు తెలిపారు

పత్తికొండ టౌన్: పత్తికొండ- ఆదోని రహదారిలో వెలసిన ఈరన్న స్వామి సన్నిధిలో శ్రావణ మాస అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం అమావాస్య పురస్కరించుకుని తెల్లవారుజామునే అర్చకులు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం సమీపంలో పల్లకిసేవ చేశారు.

హాలహర్వి: మండలంలోని చత్రగుడి అంజనేయస్వామి, గూళ్యంలో గాదిలింగేశ్వరస్వామి దేవాలయంల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయాలన్నీ భక్తులతో కిటకిటాలాడాయి.

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాసం తొలి ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారి మనోహర్ స్వామి తెలిపారు. తెల్లవారుజాము నుండే స్వామి వారికి జలభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించినట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలూరు రూరల్: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా బాబా, బెళ్ళిగుండు ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ మాసం అమావాస్య సందర్భంగా విశేష పూజలను చేశారు. హత్తిబెళగల్, మునసహళ్లి, పెద్దహోతూరు, కరిడిగుడ్డం, తదితర గ్రామాల్లో వెలసిన సోమేశ్వర స్వామి, హుచ్చిరప్ప తాత, మంగమాంబ దేవి ఆలయాల్లో రుద్రభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను చేశారు.

మద్దికెర: స్థానిక మద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేశారు. ఆదివారం అమావాస్య కావడంతో ఆలయ ప్రధాన నిర్వాహకులు విజయప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

మద్దికెర, ఆగస్టు 4: స్థానిక కొండమ్మ బావి వీధిలెపి చౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం మూలవిరాట్ విగ్ర హాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాస అమావాస్య కావడంతో పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు తరలివచ్చి పూజలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఆగస్టు 4: రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయంగా ఎన్డీయే కూటమి పని చేస్తున్నదని మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ నాయకులు వైఎం గోపినాథ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ చౌదరి, టీడీపీ నాయకులు ఉప్పరి రంగయ్య అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నా నెరవేరుస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, నేతృత్వంలో రూ.2 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పించన్లను పెంచడమే కాకుండా కంపెనీ కూడా ఒకటో తేదీనే ఇళ్ల వద్దకే వచ్చి లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారని అన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

పెద్దకడబూరు ఆగస్టు 4: మూడు నెలల క్రితం గుండె పోటుతో మరణిం చిన స్నేహితుడి కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఖాదర్ బాషా మూడు నెలల క్రితం గుండె పోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న 10వతరగతి 2004-2005కు చెందిన స్నేహితులు, గ్రామ పెద్దలు మల్లయ్య, బద్రి, గంగన్న స్వామితో కలిసి స్నేహితుడి కుటుంబ సభ్యులకు రూ.50 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు వీరేష్, నరసింహులు, గోవర్ధన్ రెడ్డి, కృష్ణా రెడ్డి, నజీర్ బాషా, రాము, సుధీర్, కృష్ణ పాల్గొన్నారు.

7 నుంచి ప్రతిష్ఠ వేడుకలు

దేవనకొండ, ఆగస్టు 4: దేవనకొండలో నిర్మించిన లక్ష్మీ చెన్నకేశవస్వామి, లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయాలలో ఈ నెల 7 నుంచి 9 వరకు విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు జరగనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయాలలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజ స్థంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి.

'ఈశ్వర్ రెడ్డి సేవలు మరువలేనివి'

తుగ్గలి, ఆగస్టు 4: మాజీ ఎమ్మెల్యే దివంగత ఈశ్వర్ రెడ్డి సేవలు మరువలేనివని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్ అన్నారు. ఆదివారం జి. ఎర్రగుడిలో ఈశ్వర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్థూపానికి నివాళులర్పించి గ్రామంలో ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో మాట్లాడుతూ పెత్తందారుల వ్యవస్థ అంతం పలకడానికి భూస్వాముల భూములను పేదలకు పంచిన ఘనత ఈశ్వర్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్ రెడ్డి, ఎర్రిశేఖర్, రంగారెడ్డి, కొండారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'అమరుల ఆశయ సాధనకు పాటుపడదాం'


పత్తికొండలో నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 4: అమరవీరుల ఆశయాల సాధనకై పాటుపడుదామని సీపీఎం జిల్లా నాయకుడు వీరశేఖర్, మండల కార్యదర్శి రంగారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు షడ్రక్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఎం నాయకులు దస్తగిరి, వెంకటేశ్వరరెడ్డి, గోపాల్, రామాంజనేయులు, సురేంద్ర, పాల్, మహ్మద్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: సీపీఎం దివంగతనేత షడ్రక్ ఆశయసాధనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు గోవిందు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, రామన్న పిలుపునిచ్చారు. షడ్రక్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా షడ్రక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీఐటీయూ నాయకులు రాముడు, కేవీపీఎస్ నాయకులు ఆంథోని, రాజు, తిమ్మన్న, గుండప్ప, లక్ష్మీనరసయ్య, అబ్దుల్లా, మనోహర్, సురేష్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టతపై ప్రచారం

ఆలూరు రూరల్, ఆగస్టు 4: త్రైత సిద్ధాంత భగవద్గీత కృష్ణాష్టమి విశిష్టతపై శ్రీ ప్రబోధానంద యోగీశ్వర స్వామి ఆశీస్సులతో ఆలూరు కేంద్రం కోట వీధిలో ఆదివారం త్రైత సిద్ధాంత గ్రంథం హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా హిందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు కృష్ణ మూర్తి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

పత్తికొండ టౌన్, ఆగస్టు 4: మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని ఎక్స్ ఆర్మీ దళిత సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఫొటోగ్రాఫర్ రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రామకృష్ణా నగర్‌లో వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల దళితులు డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం సంబరాలు చేసుకున్నారు.

హొళగుంద: ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ నగరూరు గ్రామంలో విజయోత్సవ సభను స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు చేసి ఘనంగా నివాళులర్పించి విఠాయిలు పంచుకున్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ మురళీమోహన్, ఎమ్మార్పీఎస్, సీనియర్ నాయకులు గోవిందరాజులు, రైల్వే ఈరన్న, పేతురు, రామాంజినేయులు, పురందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామ పెద్దలు మురళీ, భీమన్న, చిన్న నరసన్న, సోమశేఖర్ పాల్గొన్నారు.

'పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరం'


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుచరిత

ఎమ్మిగనూరు, ఆగస్టు 4: పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఎమ్మిగనూరు పట్టణంతోపాటు నందవరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. నందవరంలోని 1,2,3,6,7 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు మొదటి గంటలోపు తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు పద్మావతి, మేరీ, హేమలత, మెడికల్ ఆఫీసర్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: పుట్టిన చిన్నారులకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో ముఖ్యమని, తల్లిపాలతోనే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అవకాశం ఉందని, తల్లి పాల వల్ల కలిగే మేలు మరెక్కడా లభించదని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వరప్రసన్న అన్నారు. వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) సంస్థ సభ్యులు, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో వామ్ మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, శ్రీదేవి, కోశాధికారి అనూష, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాదరావు పాల్గొన్నారు.

'వివాదాలను పరిష్కరించాలి'

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 4: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల మార్పులో నెలకొన్న వివాదాలను త్వరగా పరిష్కరించాలని ఎస్టీయూ మండల ఆర్థిక కార్యదర్శి శిక్షావలి కోరారు. ఆదివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. కార్యక్రమంలో నాయకులు మహదేవప్ప, సుంకన్న, రామాంజినేయులు, రామకృష్ణ, సుధాకర్ బాబు పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవాలి'

ఆస్పరి, ఆగస్టు 4: కర్నూలు జిల్లాలో వర్షాలు లేక కరువు సంభవించిందని, రైతులను కరువు నుంచి రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందని అఖిల భారత మహాసభ సంఘం జిల్లా నాయకుడు మునిస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో రైతులతో కలిసి వేసిన వేరుశనగ, పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వీరేష్, చిన్నారి, ఎర్రి స్వామి, అంగడి వీరేష్, మల్లి, రామాంజినేయులు, చిన్నోడు పాల్గొన్నారు.

'వ్యాయామ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం'

తుగ్గలి, ఆగస్టు 4: వ్యాయామ ఉపాధ్యాయ సమస్యలకై పోరాడుతామని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం కృషి చేస్తామన్నారు.

'చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇవ్వాలి'


ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్‌తో మాట్లాడుతున్న ఆయకట్టు రైతులు

కోసిగి, ఆగస్టు 4: మాధవరం మేజర్ కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులకు ఎల్లెల్సీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని ఈఈ శైలేశ్వర్‌ను వేడుకున్నారు. ఆదివారం కోసిగిలోని ఎల్లెల్సీ కార్యాలయంలో ఆయకట్టు రైతులతో కలిసి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈఈకి సమస్యలు వివరించారు. ఉరుకుంద సమీపంలో ఎల్లెల్సీ కాలువ లిఫ్టింగ్ చేసే లస్కర్ తిరుమలేష్ కక్షపూరితంగా వ్యవహరించడం వల్ల మాధవరం మేజర్ కాలువకు సరైన నీటి వాట రావడం లేదన్నారు. కామవరం నుంచి పది రోజుల క్రితమే ఎల్లెల్సీ కాలువకు నీరు విడుదల చేసినా ఉరుకుంద దగ్గర మాత్రం హాల్వి ఎల్లెల్సీ కాలువకు మాత్రం నీటి వాటా విడుదల చేశారని అన్నారు. అయితే మాధవరం మేజర్ కాలువకు మాత్రం నీరు విడుదల చేయలేదన్నారు. గేజ్ 9/6 కి.మీ. దగ్గర ఎల్లెల్సీ వాటా మేజర్ కాలువకు నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరారు. ఆయన స్పందిస్తూ రెండు రోజుల్లోగా మాధవరం మేజర్ కాలువకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఎల్లెల్సీ ఏఈఈ రాజేష్, రంగస్వామి, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, తాయన్న, కృష్ణ, పెద్దవీరారెడ్డి, సతీష్ కుమార్, నారాయణ, హనుమంతు, కోసిగయ్య, ఈరేష్, నాగరాజు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

మద్దికెర, ఆగస్టు 4: స్థానిక సాయినగర్ కాలనీలో సుంకులమ్మ దేవాలయం సమీపాన కేవీ-11 హైటెన్షన్ విద్యుత్ తీగలు కిందకు వేలాడడం వల్ల గాలికి తగిలి విద్యుత్ బాషా అనే యువకుడు కరెంటు షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. సాయినగర్ సమీపాన విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. గ్రామానికంతా ఆ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే.. సుంకులమ్మ దేవాలయం ఆ ప్రాంతాల్లో ఉండే నివాసాలపైన విద్యుత్ తీగలు వెళ్లాయి. గాలులు ఎక్కువగా వీచడంతో విద్యుత్ ఎర్త్ కావడంతో బాషా గాయపడ్డాడు. కాలనీకి చెందిన తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, కాలనీవాసులు, బాషా, రంగస్వామి, కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ హైటెన్షన్ వైర్లు తగలడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.

బైకు అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి, ఆగస్టు 4: బైకు అదుపుతప్పి వ్యక్తి గాయాలైన ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన బోయ సుధాకర్ తన స్నేహితుడితో కలసి ఆదివారం అమావాస్య కావడంతో బ్రహగుండంలో కామేశ్వరీ సహిత బ్రహ్మేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఉదయాన్నే ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నక్కలదిబ్బ దాటిన తరువాత శుద్ధ జలకేంద్రం సమీపంలో బైకు అదుపుతప్పింది. సుధాకర్ తలకు బలమైన గాయం కావడంతో వెల్దుర్తి సీహెచ్‌సీ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు పెద్దాసుపత్రికి 108లో తరలించారు.

'బీజేపీ ప్రభుత్వ విధానాలు దేశానికి ప్రమాదం'


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 4: బీజేపీ ప్రభుత్వ మతతత్వ ప్రజా వ్యతిరేక విధానాలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం భావసార కళ్యాణ మండపంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయని అన్నారు. బడ్జెట్‌లో కార్మికులు కర్షకులు, మధ్యతరగతి, సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే విధంగా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా రాష్ట్ర రాజధాని అభివృద్ధికి రూ. 15 వేల కోట్లు అప్పుగా ఇవ్వడం దారుణం అన్నారు. వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. జిల్లా కార్యదర్శి గౌడ్ దేశాయ్, కార్యవర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, రామాంజనేయులు, ఈరన్న, మహానంది రెడ్డి, లక్ష్మణ, లింగన్న, గోపాల్ రెడ్డి, కృష్ణమూర్తి, మల్లేష్, వెంకన్న, తిప్పన, ముక్కన్న పాల్గొన్నారు.